

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

**తుమ్** గగన్ కే చంద్రమా, మై ధరా కీ ధూల్ హూ

తుమ్ ప్రణయ్ కే దేవతా హో, మై సమర్పిత ఫూల్ హూ

'ఆదినారాయణరావు' స్వయంగా చక్కటి సంగీత దర్శకుడు. ముఖ్యంగా హిందుస్తానీ సంగీతంలో ఆయన ప్రావీణ్యం అసమానమైనది. సువర్ణ సుందరి సినిమా తెలుగులోనే కాదు హిందీలోకి డబ్ అయినప్పుడు కూడా హిట్ సినిమాగా నిలవటంలో ఆదినారాయణ రావు సంగీతం ప్రధాన పాత్ర పోషించింది. ఆ సినిమాలో ఆదినారాయణరావుకు సహాయ సంగీత దర్శకుడుగా పని చేశారు లక్ష్మీకాంత్ ప్యారేలాల్. 1964లో ఆదినారాయణరావు హిందీలో అంజలీదేవి, మహిపాల్‌లతో 'సతీ సావిత్రి' సినిమా నిర్మించినప్పుడు, స్వయంగా సంగీత దర్శకత్వం వహించగలిగి ఉండికూడా ఆ బాధ్యతను లక్ష్మీకాంత్ ప్యారేలాల్‌లకు అప్పగించాడు. లక్ష్మీ ప్యారేలు అప్పుడప్పుడే సంగీత దర్శక జంటగా రంగ ప్రవేశం చేసి గుర్తింపు పొందే ప్రయత్నాలు చేస్తున్నారు.

1964 వ సంవత్సరం లక్ష్మీకాంత్ ప్యారేలాల్‌ల సంగీత జీవితంలోనే కాదు హిందీ సినీ సంగీత చరిత్రలోనూ ఒక ప్రధానమైన మలుపుకు కారణమయిన సంవత్సరం. లక్ష్మీప్యారే ప్రధమంగా సంగీత దర్శకులుగా బాధ్యత స్వీకరించిన సినిమా 'ఛైలాబాబు', ఆ సినిమా కోసం వారు రికార్డు చేసిన మహమ్మద్ రఫీ పాట 'తెరె ప్యార్‌నే ముఝె గమ్ దియా' అత్యద్భుతమైనది. కానీ ఆ సినిమా 1967లో విడుదలయింది. ఈలోగా 'పారస్మణి' అనే అతి తక్కువ బడ్జెట్ సినిమా వారి సంగీత దర్శకత్వంలోనే విడుదలయింది. 'హస్తహువా నూరానీ చెహరా ', 'వొ జబ్ యాద్ ఆయే' 'రోషన్ తుమ్హీ సె దునియా' వంటి సూపర్ డూపర్ హిట్ పాటలతో అనూహ్యంగా సూపర్ హిట్ అయింది ఆ సినిమా. దాంతో నిర్మాతలు లక్ష్మీ ప్యారే వైపు దృష్టిని సారించారు. అయితే, కొత్త సంగీత దర్శకులు కాబట్టి, ఒక్కటే సినిమా పాటలు హిట్ అయ్యాయి కాబట్టి, హిట్ అవటం వారి అదృష్టమో, ప్రతిభనో నిర్ణయించటం కష్టం కాబట్టి, పెద్ద బ్యానర్లు లక్ష్మీ ప్యారేను గమనించసాగాయి తప్ప పని అప్పచెప్పలేదు. కానీ చిన్న బ్యానర్లు లక్ష్మీ ప్యారే వైపు మొగ్గు చూపించాయి. చిన్న సినిమా అన్న చులకన భావన చూపించకుండా, తమ ప్రతిభ ప్రదర్శనకు దొరికిన అవకాశంగా భావించి చిన్న సినిమాలకు

అత్యద్భుతమైన పాటలను అందించారు లక్ష్మీ ప్యారే 1964లో విడుదలయిన సతీసావిత్రి, సంత్ జ్ఞానేశ్వర్, మిష్టర్ ఎక్స్ ఇన్ బోంబే, దోస్తీ వంటి సినిమాల ద్వారా లక్ష్మీ ప్యారే తిరుగులేని రీతిలో తమ ప్రతిభను నిరూపించుకున్నారు. అంతవరకూ అప్రతిహతంగా సాగుతున్న శంకర్ జైకిషన్‌ల జైత్రయాత్రకు అడ్డుపడ్డారు. 1964లో లక్ష్మీప్యారే దర్శకత్వం వహించిన వన్నీ తక్కువ బడ్జెట్ సినిమాలే. కానీ పాటల బలంతో పెద్ద బ్యానర్ల పెద్ద బడ్జెట్ సినిమాలను దెబ్బ తీశాయి ఈ సినిమాలు. 'దోస్తీ' సినిమా 'సంగం' సినిమా పాటలను దెబ్బతీసి అవార్డులు గెలుచుకుంది. 'మిష్టర్ ఎక్స్ ఇన్ బోంబే'లో 'మేరె మహబూబ్ ఖయామత్ హోగీ' పాటతో కిషోర్ కుమార్ రెండవ ఇన్నింగ్స్ ఆరంభమయింది. నటుడిగా చరమదశకు చేరిన కిశోర్ కుమార్ గాయకుడిగా ఉచ్ఛదశకు చేరేందుకు నాందీ ప్రస్తావనలాంటిది ఈ సినిమాలోని ఈ పాట. సంత్ జ్ఞానేశ్వర్ సినిమాలోని 'జ్యోత్ సె జ్యోత్ జగాతే చలో' అటు లత స్వరంలో, ఇటు ముకేష్ స్వరంలోనూ పోటాపోటీ 'హిట్ హిట్' గా నిలిచింది. అయితే, దోస్తీ, మిష్టర్ ఎక్స్ ఇన్ బోంబే, సంత్ జ్ఞానేశ్వర్ సినిమాలు ఈనాడు మనం చూడగలుగుతాం. హిట్ అయ్యాయి కాబట్టి అందుబాటులో ఉన్నాయి. కానీ సతీసావిత్రి సినిమా కనుమరుగయిపోయింది. ఆ సినిమా కాపీ లభ్యం కావటంలేదు. కానీ ఆ సినిమా ఈనాటికీ సజీవంగా ఉందంటే ఏకైక కారణం లక్ష్మీ ప్యారే సృజించిన పాటలు. లత స్వరంలో 'జీవన్ డోర్ తుమీ సంగ్ బాంధీ', లతా, మన్నాడేల యుగళగీతం 'తుమ్ గగన్ కే చంద్రమా' వంటి పాటలవల్ల మాత్రమే ఈనాడు ఆదినారాయణరావు నిర్మించిన 'సతీసావిత్రి' సినిమా మనకు గుర్తుంది.

'సతీసావిత్రి' సినిమాలో సూపర్ హిట్‌లుగా ఈనాటికీ సజీవంగా నిలుస్తున్న రెండు పాటలు 'యమన్' రాగంలో రూపొందించినవి అవటం గమనార్హం. హిందీ సినీ సంగీత ప్రపంచంలో యమన్, యమన్ కళ్యాణ్ రాగంలో రూపొందిన అధిక శాతం పాటలు సూపర్ హిట్‌లుగా నిలిచాయి. ప్రేమ భావనలోని పవిత్రతను, శృంగార తపనలోని సౌందర్యము, అలౌకిక భావనలను అత్యంత రమణీయంగా ప్రదర్శిస్తుందీ రాగం. దైవం శ్వేత వస్త్రాలు ధరించి, శ్వేత ఆభరణాలతో సింహం ఆసనాన్ని అధిరోహించి రమణీయంగా దర్శనమిచ్చే భావనను కలిగిస్తుందీ రాగం. హిందుస్తానీ సంగీతాన్ని అధ్యయనం చేసేవారికి ప్రధమంగా బోధించే రాగం ఇది. ఈ రాగంలో ఒక స్వరం నుంచి మరో స్వరానికి దీర్ఘం తీస్తూ చేరటం 'మీండ్', పాటకు ఒక అసమానమైన సౌందర్యాన్ని కలిగించి అత్యద్భుతమైన భావనను కలిగిస్తుంది.

'హమ్ దోనో' సినిమాలోని 'అభీ న జావో ఛోడ్ కర్' పాటలో 'అభీ' దగ్గర దీర్ఘం, జబ్ దీప్ జలే ఆనా పాటలో దీప్ దగ్గర దీర్ఘం, ఇలా యమన్ రాగంలోని పాటల మృదుత్వం, సౌందర్యం మనసును శృంగార రసప్రవాహంలో ఓలలాడిస్తుంది. 'సతీసావిత్రి' సినిమాలో లక్ష్మీ ప్యారే లతకోసం రూపొందించిన 'జీవన్ డోర్ తుమీ సంగ్ బాంధే' పాటలో 'జీవన్ డోర్' అంటూ 'డోర్' దగ్గర లత తీసిన దీర్ఘం (మీండ్) ప్రేమ భావనతో మనసులో తీయని బాధ కలిగిస్తూంటుంది.

'తుమ్ గగన్ కే చంద్రమా' పాటలో లత, మన్నాడేలు శృంగార భావనను మృదువుగా ధ్వనింపచేస్తారంటే ధ్వనిస్తారంటే ప్రేమభావనలోని ఔన్నత్యము, అత్యంత పవిత్రమైన అలౌకిక ఆనందమూ మనసుకు స్ఫురిస్తుంది. ఈ సందర్భంలో భరత్ వ్యాస్ గేయ రచనా సంవిధానాన్ని స్మరించక తప్పదు.

హిందీ సినీరంగంలో అత్యంత శుభ్రమూ, పవిత్రమూ అయిన శుద్ధ హిందీ పదాలను అత్యంత మధురంగా వాడి పాటల స్థాయిని పెంచిన గేయ రచయిత భరత్ వ్యాస్. ఆ కాలంలో హిందీ పాటలలో ఉర్దూ పదాలు అధికంగా వినిపించేవి. కవి ప్రదీప్, భరత్ వ్యాస్‌లిద్దరూ శుద్ధ హిందీ పదాలతో హిందీ సినీపాటలకు సాహిత్య గంధాన్ని అద్దారు. వీరి వారసత్వాన్ని 'ఇందీవర్' అందిపుచ్చుకున్నాడు.

భరత్ వ్యాస్ పాటలను వింటే ముందుగా మనసును తాకేది ఆయన పదాల వాడకం.

**బర్సే గగన్**

**మేర బర్‌సే నయన్**

**దేఖో తర్‌సే యే మన్ అబ్ తో ఆజా**

**శీతల్ పవన్, యే లగాయే అగన్**

**హో సజన్ అబ్ తో ముఖ్డా దిఖాజా**

ఒక హిందీ కవితను చదువుతున్నట్టుంటుంది. గగన్, నయన్, శీతల్ పవన్, అగన్, పదాలను అత్యంత సుందరంగా వాడాడు భరత్ వ్యాస్, 'ఆ లౌట్ కె ఆజా మెరే మీత్ ' పాటలో

**తెరే బాలోమే సింటీ సావన్‌కీ ఘటా**

**తెరే గాలోంపే చట్కీ పూనం కీ ఛటా**

**తీఖే తీఖే నయన్, మీఠే మీఠే బయాన్**

**తెరి ఆగే సే చంపా కా రంగ్ చఢా**

**బడే మన్‌సే విధాతనే తుఝ్‌కో ఘడా**

'నవరంగ్' సినిమాలోని 'శ్యామల్ శ్యామల్ బరన్' పాటలో పదాలయితే శుద్ధ హిందీ డిక్షనరీనుంచి నడుస్తూ తిన్నగా పాటలోకి వచ్చినట్టనిపిస్తాయి. లయబద్ధంగా పాటలో వొదిగినట్టనిపిస్తాయి.

**ప్రణయ గీత్‌కీ ప్రథం పంక్తి హో**

**యా మను కీ పహలీ సంతాన్**

**నవ యవ్వన్ కే ప్రథమ్ దృష్టి హో**

**నయనోం కే పహలీ పహెచాన్**

**కౌన్ హో తుం , కౌన్ హో...**

ఇదే భారతీయ ఇదే భారతీయ భాషలలోని గొప్పతనం. ఏ భాష అయినా దాని శుద్ధ రూపంలో వాడితే, భారతదేశంలోని ఇతర భాషలు మాతృభాషగా కలవారికి, భావం సులభంగా బోధపడుతుంది. దీనికి భాష తెలియాల్సిన అవసరంలేదు. మాతృభాష వచ్చి ఉంటే చాలు.

'ప్రణయ గీత్' అంటే ఎవరికి అయినా తెలుస్తుంది. 'ప్రథమ పంక్తి' అంటే తెలుస్తుంది. 'ప్రణయగీత్ కీ ప్రథమ పంక్తిహో' అంటే, ఎవరూ అర్థం చెప్పనవసరం లేకుండానే అర్థ అవుతుంది. ఇది ఏ భాషకయినా వర్తిస్తుంది. విశ్వనాథ సత్యనారాయణ వారణాసిలో తెలుగు పద్యాలు చదివి వినిపిస్తే ఆ సభలో ఉన్న తెలుగేతరులు సైతం విని అర్థం చేసుకుని ఆనందించి, అభినందించారు. అందుకే భరత్ వ్యాస్ పాటలు విన్న వెంటనే మనసుకు హత్తుకుపోతాయి. పాటలోని భావం మనసును మురిపిస్తుంది. సంగీత దర్శకుడు చేయవలసిందల్లా తగిన బాణీని కూర్చటం, తగిన గాయనీ గాయకులను ఎన్నుకోవటం మాత్రమే. భరత్ వ్యాస్ పదాలు శ్రోతను ఆకర్షించి పాట ఆకర్షణీయతను ఇనుమడింపచేస్తాయి. ఏయ్ మాలిక్ తెరే బందే హమ్, బోలెరే పప్పీహరా, హమ్ కొ మన్‌కి శక్తిదేనా, తేరే సుర్ ఔర్ మేరే గీత్, ఆధాహై చంద్రమా, వో నిర్దయీ ప్రీతమ్.. ఇలా పాట 'భావం'తో అలరించటం భరత్ వ్యాస్ పాటలలో స్పష్టంగా కనిపిస్తుంది. ఒకోపాటలో ఆయన వాడిన పదాలు, పాటను కూర్చిన రాగంలో ఆ పదాలు వొదిగి కలిగించిన అద్భుతమైన భావనలు, భాషపై పట్టు, గౌరవం, ఉన్న కవి రాసే సినీగీతాలు ఎలా ఉంటాయో తెలుస్తాయి. ఎంత సంస్కారవంతంగా

పాటలను సృజించే వీలుంటుందో భరత్ వ్యాస్ ప్రతిపాట ప్రదర్శిస్తుంది. 'తుమ్ గగన్‌కే చంద్రమా ' పాట ఇందుకు నిదర్శనం. కథ సావిత్రి, సత్యవంతులది. పురాణగాధ. అతి పవిత్రమైనది. వారి నడుమ ప్రణయం కూడా అంత పవిత్రమూ, సంస్కారవంతమూ, ఉన్నతమూ అయినది. అలాంటి ప్రణయాన్ని వ్యక్తపరచే పాట కూడా వారి స్థాయికి తగ్గట్టు ఉండాలి. సినీ ప్రపంచంలో ఆ స్థాయి రచన చేయగలిగినది భరత్ వ్యాస్ ఒక్కడే అన్నది నిర్వివాదాంశం. పాటలో పదాలు వింటూంటే, ఎలాంటి వివరణ అవసరం లేకుండా భావన బోధపడుతుంది. స్త్రీ పురుషులు ఒకరినొకరు గౌరవించుకుంటూ, ధర్మ బద్ధంగా ప్రణయ భావనను వ్యక్త పరిస్తే, ఆ భావన ఎంత ఉన్నతంగా, ఉత్తమంగా వుండి, సమాజం ముందు ఒక చక్కని స్థాయి ఆలోచనలకు ప్రామాణికంగా వుంటుందో ప్రదర్శిస్తుందీ పాట.

**తుం గగన్‌కీ చంద్రమా హో, మై ధరా కీ ధూల్ హూ**

**తుం ప్రణయ్‌కీ దేవతాహో, మై సమర్పిత్ ఫూల్ హూ**

నాయిక సంస్కారవంతంగా, పవిత్రంగా తన ప్రణయాన్ని వ్యక్తపరచింది. నాయకుడి స్పందనకూడా ఇదే స్థాయిలో ఉంటుంది.

**తుమ్ హో పూజా మై పూజారీ, తుమ్ సుధా, మై ప్యాస్ హూ**

ఆమె పూజ, అతను పూజారి. వాక్కుకూ భావానికీ నడుమ వున్న సంబంధమే, పూజకూ, పూజారికీ నడుమ వుంటుంది.

ఇక్కడినుంచి పాటలో ప్రతి పదం అత్యంత ఉత్తమమూ, పవిత్రమూ అయిన ఉపమానాలతో సాగుతుంది.

**తుమ్ మహా సాగర్ కీ సీమా, మై కినారే కీ లహర్**

**తుమ్ మహా సంగీత్ కే స్వర్ , మై అధూరీ సాంస్‌హూ**

**తుమ్ హో కాయా, మై హూ ఛాయా**

**తుమ్ క్షమా మై భూల్ హూ**

అద్భుతం అనిపిస్తుంది పాట వింటూంటే, లతా మన్నాడేల స్వరాలలో ఈ పదాలు ఒక పవిత్రమైన అత్యున్నతమైన ప్రణయ శృంగార భావనలను అద్దుకుని మనస్సు లోలోతుల్లో స్పందనలు కలిగిస్తూంటే సమాజానికి సంస్కారాన్ని సినిమాల ద్వారా నేర్పటం అంటే ఇదే అనిపిస్తుంది.

**తుమ్ ఉషా కే లాలిమా హో**

**భోర్ కా సింధూర్ హో**

**మేరే ప్రాణోంకీ హో గుంజాన్**

**మేరే మన్ కీ మయూర్ హో**

**తుమ్ హో పూజా మై పూజారీ**

**తుమ్ సుధా మై ప్యాస్ హూ...**

ఇదీ ఒక అత్యద్భుతమైన శృంగార ప్రణయగీతం. ఆధునిక సినీ సంగీత ప్రపంచంలో అస్సలు వినబడవు ఇలాంటి పాటలు. కానీ సమాజానికి దిశానిర్దేశనం చేసి, యువతీ యువకులలో ప్రణయ భావన అంటే ఒకరినొకరు సంపూర్ణంగా సమర్పించుకోవటం, ఒకరినొకరు గౌరవించి అభిమానించటం, ఒకరినొకరు ప్రేరేపించుకుంటూ, ఆత్మగౌరవంతో, ఆత్మ విశ్వాసంతో ఇద్దరూ శరీరాలు వేరైనా ఒకే మనసు కలవారిలా ఉత్తమ స్థాయికి ఎదగటం అని నిరూపించి బోధించే ఇలాంటి సంస్కారవంతమయిన ప్రణయ గీతాలు మన సినిమాల్లోంచి దాదాపుగా అదృశ్యమైపోయాయి.

(వచ్చేనెల మరిన్ని మధురమైన గీతాలతో కలుద్దాం.)

Click here to share your comments